VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
ఆదివారం 28 ఏప్రిల్ 2024
సంపుటి.01 సంచిక.282



3లో

## భాగ పంపిణీకి ఇక శ్మశానం తప్ప ఏమీలేదు




# దేశంలో ఉగ్రవాదం తుదముట్టించాలి

**మూడోసారి మోడీనే గెలిపించాలి**

**పోరుబందర్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పిలుపు**

**వరుసగా మూడోసారి నరేంద్ర మోదీని భారత ప్రధానిని చేయాలని దేశ ప్రజలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. శనివారం పోర్ బందరులో బీజేపీ అభ్యర్థి మనుశుక్ మాండవ్యాకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు.**

పోరుబందర్: ముచ్చటగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ అవకాశం ఇస్తే.. ఆయన దేశంలో నక్సలిజానికి, ఉగ్రవాదానికి చరమగీతం పాడతారన్నారు. అయితే కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని బీజేపీ రద్దు చేసిందని.. అయితే ఆ ఆర్టికల్ రద్దును కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారని అమిత్ షా ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాశ్మీర్‌లో రక్త ప్రవాహం కోసమే రాహుల్ ఈ విధంగా వ్యవహరించారని అమిత్ షా ఆరోపించారు. గత అయిదేళ్లలో కాశ్మీర్‌లో ఒక్క రక్తపాత ఘటన కూడా చోటు చేసుకోలేదని అమిత్ షా ఈ సందర్భంగా ఉదాహరించారు. అలాగే దేశంలో ఉగ్రవాదం, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ పని చేస్తున్నారనీ వివరించారు. అలాగే ప్రదానిగా మన్మోహన్ సింగ్ ఉన్నప్పుడు దేశంలో ఎలా ఉంది, మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఓ సారి ఆలోచించాలని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు. ఇక భారత్‌లో పుల్వామా, యూరీ ఘటనలకు పాక్ దుశ్చర్యలకు పాల్పడితే.. భారత్ మాత్రం సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా ఆ దేశానికి జవాబు ఇచ్చిందని ఈ సందర్భంగా అమిత్ షా గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ పాలనలో భారత్ ఆర్థిక పరిస్థితి 11వ స్థానంలో ఉండేదని.. కానీ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ ఆర్థిక పరిస్థితి 5వ స్థానానికి ఎగబాకిందన్నారు. అదీ కూడా కేవలం 10 ఏళ్లలోనే అని అమిత్ షా గుర్తు చేశారు. ప్రధానిగా మోదీకి మరో అవకాశం ఇస్తే.. భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద శక్తిగా ఆవతరింప చేస్తారని.. అందుకు తాను గ్యారంటీ అని అమిత్ షా స్పష్టం చేశారు.

# రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్రలు



2లో

**దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ దేశ రాజకీయాలను, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశంపై విస్పష్టంగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు.**

- పూర్తి హిందూరాజ్యంగా మార్చే కుయుక్తులు
- దామాషా ప్రకారం రిజర్వేషన్లు మా సిద్ధాంతం
- అందుకే కులగణన చేపట్టాలన్నది కాంగ్రెస్ నిర్ణయం
- 400 సీట్ల లక్ష్యం వెనక రాజ్యాంగం మార్చే కుట్ర
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్

## ఈటల గెలుపుపై మల్లారెడ్డి వ్యాఖ్యలు..
# కేటీఆర్ రియాక్షన్



హైదరాబాద్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలవబోతున్నారని ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మల్లారెడ్డి తన రాజకీయం అనుభవంతోనే ఈటలపై ఆ కామెంట్స్ చేశారని పేర్కొన్నారు. మల్లారెడ్డి చాలా తెలివిగల వ్యక్తి అని, ఈటల రాజేందర్‌ను మునగ చెట్టు ఎక్కించి కింద పడేయాలనేది ఆయన వ్యూహమని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈటలపై చేసిన వ్యాఖ్యల విషయంలో మల్లారెడ్డి తన రాజకీయ అనుభవాన్ని చాటుకున్నారని తెలిపారు. మల్లారెడ్డి మాటల అంతరార్థం తెలియక కొంతమంది ఆగమాగమవుతున్నారని, ఆయన వ్యాక్యాలు సీరియస్‌గా తీసుకోవద్దని తెలిపారు. మల్కాజ్‌గిరిలో కచ్చితంగా గెలిచేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. అది ఈటల రాజేందర్‌కు కూడా తెలుసన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాలు గెలుచుకోబోతుందని చెప్పారు కేటీఆర్. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి,నేషనల్ మీడియాలో ప్రధాని మోదీకి ఓటేయ్యండి అంటూ చెబుతున్నారని విమర్శించారు. త్వరలో రేవంత్ ఖచ్చితంగా బీజేపీలోకి వెళతారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇప్పటికీ వరకు ప్రతి ఇంట్లో కేసీఆర్‌ను తలుచుకోని రోజు లేదని అన్నారు. అధికార కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వస్తోందని దుయ్యబట్టారు.



2లో

## ప్రచారంలో పురందేశ్వరి దూకుడు

- ఎన్టీఆర్ తనయగా అన్నివర్గాల నుంచి మద్దతు
- బిజెపికి అనుకూలంగా మారుతున్న సమీకరణాలు

## మోపూరిత కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరు



ఆవిర్భావ సభలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

2లో

2లో

## ప్రచారంలో కారు జోరు..

- గెలుపు లక్ష్యంగా అప్రమత్తం అయిన నేతలు
- రైతులే ఎజెండగా ప్రణాళికా బద్ధంగా ప్రచారం



2లో

## కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

- మాయమాటలతో అధికారంలోకి వచ్చారు
- అవిర్భావ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు

# మునుపటి పోలింగ్ కేంద్రాల్లోనే మీ ఓట్లు

**'లోక్‌సభ ఎన్నికల్ని పకడ్బందీగా నిర్వహించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రాష్ట్రంలో 3.32 కోట్ల మంది ఓటు హక్కు వినియోగానికి వీలుగా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం.**

**తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఓటింగ్ సమయాన్ని పెంచాలన్న వినతుల్ని ఈసీకి పంపాం**

**ఇంటి నుంచి ఓటు వేసేందుకు 24,974 మంది నమోదు**



హైదరాబాద్: 'లోక్‌సభ ఎన్నికల్ని పకడ్బందీగా నిర్వహించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రాష్ట్రంలో 3.32 కోట్ల మంది ఓటు హక్కు వినియోగానికి వీలుగా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. గత ఏడాది నవంబరులో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఓటేసిన కేంద్రాల్లోనే ఓటు వేయవచ్చు' అని కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. శనివారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. "ఈవీఎంలను కేటాయించేందుకు త్వరలో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడతాం. రాష్ట్రంలో 119 శాసనసభ స్థానాలు ఉండగా అసెంబ్లీ ఎన్నికలప్పుడు 25 నియోజకవర్గాలకు సంబంధించి వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిలో 20 నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వినియోగించుకునేందుకు న్యాయస్థానం, ఎన్నికల సంఘం నుంచి అనుమతి లభించింది. మిగిలిన ఐదింటి విషయంలో స్పష్టత రాలేదు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు గంటలకే పోలింగ్ పూర్తి కానుంది. ఆ సమయాన్ని పెంచాలని రాజకీయ పార్టీల నుంచి వినతులు వచ్చాయి. వాటిని ఎన్నికల సంఘానికి పంపాం.

**మరో 50 కంపెనీల బలగాలను కోరాం**

రాష్ట్రానికి 155 కంపెనీల సాయుధ బలగాలు వచ్చాయి. మరో 50 కంపెనీలను కేటాయించాలని కోరాం. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 375 కంపెనీల బలగాలు వచ్చాయి. ఈ దఫా దేశవ్యాప్తంగా వివిధ దశల్లో పోలింగ్ జరగనుండటంతో వాటి సంఖ్య తగ్గింది. రాష్ట్రంలో ఉన్న 60 వేల యూనిఫాం సర్వీసు ఉద్యోగులతోపాటు పక్క రాష్ట్రాల నుంచి 20 వేల పోలీసు బలగాలు రాష్ట్రానికి రానున్నాయి. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే సాయుధ బలగాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అక్కడి లోక్‌సభ స్థానాలకు రెండు దశల పోలింగ్ పూర్తి అయింది. ఆ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం.

**పోస్టల్ బ్యాలెట్లు అడిగిన వారు 2.80 లక్షల మంది**

లోక్‌సభ ఎన్నికల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకునేందుకు నమోదు చేసుకున్నారు. వారిలో 80 శాతం మంది సొంత నియోజకవర్గాల్లో ఓటు వేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు మూడు రోజులు అవకాశం కల్పిస్తాం. ప్రస్తుతానికి వచ్చే నెల 5, 6, 7 తేదీలని అనుకుంటున్నాం. ఎన్నికల సంఘం అనుమతితో ఆ తేదీలను త్వరలో ఖరారు చేస్తాం. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసే ఫెసిలిటీ సెంటర్‌లో ఓటేయవచ్చు. అందరూ ఒకే రోజు వెళితే ఇతర పనులకు ఇబ్బంది వస్తుంది. అందుకోసమే మూడు రోజుల వ్యవధి నిర్ణయించాం. వారు ఓటు వేసేందుకు ఎంచుకున్న రోజున ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. ఇంటి నుంచి ఓటు వేసేందుకు 24,974 మంది ఎంచుకున్నారు. వారిలో 11,238 మంది 85 సంవత్సరాలు దాటిన వారు. 11,904 మంది దివ్యాంగులు. 1,832 మంది వివిధ

# నవరత్నాల పేరుతో నవ మోసాలు



నెల్లూరు:రాష్ట్రంలో దొంగలు పడ్డారని.. మనల్ని మనం కాపాడుకోవాలంటే అందరం కర్రలు చేతపట్టి రోడ్ల మీదకి రావాలని పిలుపునిచ్చారు. రాతియుగం పోవాలి, స్వర్ణయుగం రావాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తాం.. వైసీపీ అధికారంలోకి వస్తే ఏపీలో మళ్లీ అరాచకం సృష్టిస్తుందని చంద్రబాబు విరుచుకుపడ్డారు. నెల్లూరుపాళెం కూడలిలో 'ప్రజాగళం' భారీ బహిరంగ సభలో సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ నవరత్నాలు.. నవమోసాలు అయ్యాయని దుయ్యబట్టారు. 'గులకరాయితో హత్యాయత్నం చేశానని నాపై నింద వేశారు. కోడి కత్తి కేసులోనూ ఇలాంటి ఆరోపణలే చేశారు. బ్యాండేజ్ తీయకుండా డ్రామాలు చేద్దామని జగన్ అనుకున్నారు. అందరూ హేళన చేయడంతో ఇవాళ బ్యాండేజ్ తీసేశారు. గాయం కపడిందా?' అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఈ సభలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్డీఏ కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. నెల్లూరుపాళెం కూడలి జనసంద్రంగా మారింది. కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆత్మకూరు పసుపుమయంగా మారింది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రంలో సైకో జగన్, విజయసాయి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి తప్పించి ఎవరూ బాగుపడలేదన్నారు. ఒక నాయకుడికి పరిపాలన దక్షత ఉండాలన్నారు. సంపద సృష్టించాలి.. కానీ ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేయకూడదని హితవు పలికారు. తెలుగు జాతికి, తెలుగువారికి, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన వ్యక్తి.. ఈ సైకో జగన్ అని విమర్శించారు. జాబు రావాలంటే బాబు రావాలి, గంజాయి ఉండాలంటే జగన్ ఉండాలన్నారు. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్ అని చెప్పారు. అభివృద్ధి జరిగితే సంపద పెరుగుతుందన్నారు. సంపద పెరిగితే ఆదాయాలు పెరుగుతాయని.. ఆర్థిక వ్యవస్థలో ఇదో రహస్యమని వివరించారు. జగన్ అస్సలు చదువుకున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో మన భూములు, ఆస్తులకి రక్షణ లేదన్నారు. బ్రిటీషు కాలం నుంచి వచ్చిన చట్టాలని, రికార్డులని మార్చేశారని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మీరు కొట్టే దెబ్బ అదిరిపోవాలి. సీనియర్ నేత, అనుభవం ఉన్న వ్యక్తి,.. జిల్లాను అభివృద్ధి చేసిన వ్యక్తి ఆనం రామనారాయణరెడ్డి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి రాజకీయం, డబ్బులు అవసరం లేదు. తాను సంపాదించిన డబ్బు ప్రజల కోసం ఖర్చుపెట్టారు. పోటీకి ఎవరిని పెట్టారో చూశారా? ఆ వ్యక్తిని ఎప్పుడైనా చూశారా? ఏమైనా అభివృద్ధి చేశారా? సోమశిల డ్యాం, కండలేరు డ్యాంని నిర్మించి డెల్టాని సుస్థిరత చేసిన వ్యక్తి ఎన్టీఆర్, టీడీపీ. నెల్లూరు జిల్లాలో బ్రహ్మాండంగా పంటలు పండుతున్నాయంటే, అది ఎన్టీఆర్ పుణ్యం. ఇక్కడో ఎమ్మెల్యే ఉన్నాడు... దోచుకోవడం తప్పించి అభివృద్ధిపై శ్రద్ధ లేదు. మరో మంత్రి ఉన్నాడు... ఆయనకు గనుల మీదే దృష్టి. కరోనా సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే... రైతులు కష్టించి పంటలు పండించారు. ధాన్యం అమ్మకాల్లోనూ దోచుకున్నారు. రైతులకు ఏడాదికి రూ.25వేలు ఇస్తాం. వ్యవసాయంలో యాంత్రీకరణ తీసుకొస్తాం. పోలవరంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. నదులను అనుసంధానం చేస్తాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. 'ఇవాళ వైసీపీ మేనిఫెస్టో విడుదల చేస్తే, రైతులకు సంబంధించి ఒక్క పథకం లేదు. మద్యపాన నిషేధం చేస్తానని చేశారా?... మద్యం మీదా దోచుకుంటున్నారా? లేదా? మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానని అన్నాడు. సిగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నాడు. మహిళల తాళిబొట్లు తెంచేశాడు. గులకరాయి డ్రామా బయటపడింది. అందరూ బ్యాండ్లు పెట్టుకుంటున్నారు. గులకరాయితో హత్యాయత్నం చేశారంటారు. కోడికత్తిని గుచ్చారంటారు. బాబాయిని గొడ్డలితో నరికి చంపుతారు. ట్యాంకులో నీళ్లుంటే ట్యాపుల్లో నీళ్లొస్తాయి. రూ.14 లక్షల కోట్లు అప్పు చేశాడు. ఒక్కొక్కరి నెత్తిన రూ.8లక్షల అప్పు పెట్టాడు. ఇసుక, గంజాయి, ఎర్రచందనం, మైనింగ్ కుంభకోణాలు... నాపైన ఎవరైనా కేసులు పెట్టారా? నేను తప్పులు చేశానా? అడ్డొచ్చిన వారిని నరికేస్తారా? ఇప్పుడేమో మేము శత్రువులంటున్నారు. రాజకీయ ప్రత్యర్థులు, వైసీపీకి ఓట్లు వేయని వారు శత్రువులా? మళ్లీ పాత రాష్ట్రం రావాలంటే... గంజాయి, డ్రగ్స్ పోవాలంటే ఈ ఎన్నికల్లో కూటమి గెలవాలి. మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేస్తా. పది రోజులు మీరు పనిచేయండి... మీ భవిష్యత్తుకి బంగారు బాటలు వేసే బాధ్యత నేను తీసుకుంటా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీలు, హోంగార్డులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని తెదేపా అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. సీఎం జగన్ రూ.14 లక్షల కోట్లు అప్పు చేశారు. పోలవరాన్ని పూర్తి చేస్తానని చెప్పి.. గోదావరిలో కలిపారు. వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తానన్న హామీ నెరవేరిందా? రాష్ట్రంలో ఉత్తరకొరియా పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు ఇస్తామనే హామీ వైకాపా మేనిఫెస్టోలో లేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే తొలి సంతకం డీఎస్సీ పైనే. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం చేస్తా. తల్లికి వందనం కింద ప్రతి పిల్లవాడికి ఏటా రూ.15 వేలు ఇస్తా. ఆత్మకూరు సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది. వచ్చే ఎన్నికల్లో మీ జీవితాలు మార్చే బటన్ నొక్కండి. రాష్ట్రంలో దొంగలు పడ్డారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ఈ ఎన్నికలు మన భవిష్యత్‌ను మార్చబోతున్నాయి. మేం వస్తే అభివృద్ధి.. వైకాపా వస్తే అరాచకం. మా పాలన స్వర్ణయుగం.. వైకాపా పాలన రాతియుగం. సీఎం జగన్ ఇవాళ చేతులెత్తేశారు. వైకాపా మేనిఫెస్టోతో పోలిస్తే.. మా మేనిఫెస్టో సూపర్ సక్సెస్. చంద్రబాబు అంటే అభివృద్ధికి బ్రాండ్. నేరాలు, ఘోరాలు చేయడంలో జగన్ పీహెచ్‌డీ చేశారు. వైకాపా మేనిఫెస్టోలో రైతులకు ఏమీ చెప్పని దుర్మార్గుడు జగన్. తమ మేనిఫెస్టో భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని అన్నారు. అందులో హామీలను నెరవేర్చారా?మద్య నిషేధం చేస్తానన్న హామీ ఏమైంది? స్వార్థం కోసం మహిళల తాళిబొట్లు తెంపేసిన వ్యక్తి జగన్' అని చంద్రబాబు విమర్శించారు.

# దళితులు, ఆదివాసీలు, గిరిజనులపై దాడులు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో దళితులు, ఆదివాసీలు, గిరిజనులపై దాడులు విపరీతంగా జరుగుతున్నా చర్యలు లేవని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఘనత వహించిన మీ ఏలుబడిలో బడుగు బలహీనవర్గాల బతుకులు దయనీయంగా మారాయని, జీవన ప్రమాణాలు కూడా అధ్వానంగా ఉన్నాయన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సంచలన లేఖ రాశారు. ఇదీ నీ పాలన అంటూ జగన్ పాలనా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బలహీనవర్గాల జీవన ప్రమాణాలు అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. శనివారం నాడు ఈ మేరకు ఆమె లేఖ రాశారు. వారికి రాజ్యాంగపరంగా దక్కాల్సిన హక్కులకు కూడా దిక్కులేని పరిస్థితి మీ పాలనలో ఎదురవుతోంది. నిధులు దారి మళ్లించి బ్జడెట్ పరంగా 'ఉప ప్రణాళిక'ని మంట గలిపారు. మీరొచ్చేదాకా కొనసాగుతున్న 28 పథకాలు, కార్యక్రమాలను నిర్దయగా, నిర్లక్ష్యంగా నిలిపివేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో దళితులు, ఆదివాసీలు, గిరిజనులపై దాడులు జరుగుతున్నా.. దాష్టీకాలు పెరుగుతున్నా పట్టనట్లే ఉన్నారు. వాటిని నివారించి వారిని కాపాడే నిర్దిష్ట చర్యలు లేవు. ప్రధానంగా వారికి రక్షణ లేదు. పైగా, ఇలా దాడులు దౌర్జన్యాలకు తెగబడుతున్న వారిలో ఎక్కువమంది మీ పార్టీకి చెందిన పెత్తందార్లు, మోతుబర్లు, రౌడీ మూకలే! ఉన్నారు.' అంటూ జగన్ పాలనా తీరుపై షర్మిల ధ్వజమెత్తారు. ఎక్కడ అవకాశం దొరికినా.. వేదికెక్కి ప్రసంగించినా 'నా ఎస్సీలు, నా ఎస్టీలు' అంటూనే వారిని వంచించారు. మేలు చేయకపోగా కీడు చేస్తున్నారు. దళితులపై చేసిన దాష్టీకాలకు, నేడు కోర్టులో శిక్షపడ్డా ఆయనను అందలం ఎక్కించాలని సిగ్గు, సంస్కారం వదిలేసినా మీ నాయకత్వానికే చెల్లుతుంది. ఇప్పుడు కూడా మీ పార్టీలోని దళిత నాయకులు, ఏరుదాటి తెప్పతగలేసే మీ బరితెగించిన వాలకాన్ని తట్టుకోలేక ఎలా బయటకు వస్తున్నారో వేరే చెప్పాలా ముఖ్యమంత్రిగారు!' అంటూ జగన్ తీరుపై నిప్పులు చెరిగారు షర్మిల. పేదలు పెత్తందార్లకు మధ్య క్లాస్ వార్' అంటూనే కడు పేదలైన ఎస్సీ ఎస్టీలు కోలుకోలేని విధంగా మీరు దెబ్బతీశారు. ఇంత అన్యాయమా? అన్ని విధాలా అన్యాయానికి గురవుతున్న ఎస్సీ ఎస్టీలకు సత్వరం విముక్తి కలిగించండి! 'కన్న తల్లే దయ్యమైతే తొట్టెల కట్టే స్థలం లేదన్న' సామెత చందంగా.. ప్రభుత్వమే పగబట్టినట్టుండటం..
దళిత గిరిజన వర్గాల వంచనకు నిలువెత్తు నిదర్శనం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జరిగిన అన్యాయానికి క్షమాపణలు కోరండి. ఇకపై ఏ వివక్షా లేకుండా, తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని మాటివ్వండి. వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యల్ని తక్షణం చేపట్టండి. బాధ్యత కలిగిన రాజకీయ పక్షంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఇదే మా డిమాండ్!' అని లేఖలో తనదైన శైలిలో జగన్‌పై విరుచుకుపడ్డారు.

# ప్రచారంలో పురందేశ్వరి దూకుడు

**రాజమండ్రి:** ప్రచారంలో పురందేశ్వరి దూకుడు పప్రద్శిస్తున్నారు. ఎన్టీఆర్ తనయగా అన్నివర్గాల నుంచి మద్దతు దక్కుతోంది. బిజెపికి అనుకూలంగా మారుతున్న సమీకరణాలు మారుతు న్నాయి. మోడీ నినాదం కూడా బాగా కలసి వస్తోంది. రాజమండ్రి సీటులో ఇప్పుడు ఎన్టీఆర్ తనయ పురంధేశ్వరి దూసుకుపోతోంది. 'తూర్పు' ఆడబడుచుగా సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంట్ బరిలో బీజేపీ తరపున అడుగుపెట్టారు. గోదావరి తీరంతో ఎన్టీఆర్‌కి ఉన్న అనుబంధం.. తూర్పుగోదావరి జిల్లాలో కమలానికి ఉన్న ఆదరణ కలగలిపి ఆమె విజయం నల్లేరుపై నడకేననే ధీమా వ్యక్తమవుతోంది. ఆ కుటుంబాన్ని వర్గవర్ణాలకు అతీతంగా అభిమానించే వాళ్లకు కొదువ లేకపోవడం.. మూడు పార్టీల పొత్తుతో వచ్చిన జోరు ఆ ధీమాకు కారణం కావచ్చు. దీంతో కులమతాలకతీతంగా రాజమహేంద్రి ఎన్టీఆర్ కూతురికి స్వాగతం పలుకుతోంది. జిల్లాలోని బీజేపీలో ఏదో తెలియని నైరాశ్యం అలముకుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని పార్టీలో వర్గపోరు నెలకొంది. ఇప్పటికీ రెండు మూడు వర్గాలుగా చీలిపోయి ఎవరి తీరు వారిదే అనే చందంగా పార్టీ ఉంది. అందరినీ ఓ దారికి తీసుకు రావడం ఇప్పుడు పురందేశ్వరి ముందున్న పెద్ద సవాల్. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ కుటుంబానికి అన్ని వర్గాల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉండడం ఆమెకు అధిక శాతం కలిసొచ్చే అంశంగా
చెప్పుకోవచ్చు. 1998లో గిరజాల వెంకటస్వామినాయుడు, తర్వాత ఎస్‌పీబీకే సత్యనారాయణను ఇక్కడి ప్రజలు పార్లమెంట్‌కి పంపించారు. సత్యనారాయణ కేంద్ర మంత్రిగా కూడా సేవలందించారు. 2014లో ఆకుల సత్యనారాయణ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా కమలం గుర్తుపై గెలు పొందారు. 1998లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు వంటి హేమాహేమీలు వాజ్‌పేయి ప్రభుత్వ సమయంలో బీజేపీలో చేరారు. కాకినాడలో పెద్ద సంఖ్యలో కవాతు నిర్వహించారు. 1984 నుంచి 2019 వరకూ జరి గిన పది లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి బీజేపీ రెండు సార్లు ఎంపీలు ఢిల్లీకి వెళ్లారు. ఓసారి రాజమహేంద్రవరం నుంచి కమలం తరపున ఎమ్మెల్యే సారథ్యం వహించారు. పురందేశ్వరికి రాజకీయంగా తండ్రికి దగ్గ కూతురు అనే పేరుంది. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో ఎన్నో ప్రాధాన్యం ఉన్న పదవులను ఆమె కైవశం చేసు కున్నారు. ఆమె వాక్చాతుర్యం, శ్రమించే తత్వం చూసి ఆయా పార్టీల పెద్దలు కీలకమైన బాధ్యతలు అప్పగించారు. ఏ పార్టీలో ఉన్నా ఆమె తనకంటూ ఓ అస్థిరత సముపార్జించుకున్నారు. 2004లో బాపట్ల నుంచి తొలిసారి లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందారు. 2009లో విశాఖపట్నం నుంచి రెండో సారి ఎంపీగా ఎన్నికై మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో వాణిజ్యం, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రిగా సేవలందిం చారు. 2014లో బీజేపీలో చేరారు. అనతికాలంలోనే మహిళా మోర్చా ప్రధాన ప్రభారిగా, బీజేపీ ఒడిశా ఇన్‌చార్జి, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఇండి పెండెంట్ డైరెక్టర్ తదితర హోదాల్లో పనిచేశారు. 2023 జూలై 4న ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ బీజేపీలో తొలి మహిళా అధ్యక్షు రాలిగా రికార్డు సాధించారు. . రాజమహేంద్రవరం ఎంపీగా ఆమె గెలిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధికి నిధులు సునాయాసంగా తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ ఐదేళ్లలో పారిశ్రామికంగా, పర్యాట కంగా జిల్లా వెనకడుగు వేసిందనడంలో సందేహం లేదు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అంతంత మాత్రమే. పెద్ద ప్రాజెక్టులు కూడా ఏమీ మంజూరు కాలేదు. మరోవైపు ఆమె గతంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయ మంత్రిగా పని చేయడంతో యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని స్థానిక బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. పురందేశ్వరిని రాజమండ్రి నుంచి పార్లమెంట్‌కి కచ్చితంగా పంపిస్తాం అని అంటున్నారు.

# ప్రచారంలో కారు జోరు..

**నిజామాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నది. అసెంబ్లీలో ఓటమితో ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నది. పార్టీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్ కుమార్ క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణెళిశ్‌గుప్తా, పార్టీ ముఖ్య నేతలు ప్రచార బాధ్యతలు చేపట్టారు. అటు జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జాజాల సురేందర్, గంప గోవర్ధన్ తదితరులు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు, ప్రత్యర్థి పార్టీల ప్రచారానికి దీటుగా ప్రచారం చేస్తున్నా బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై విమర్శలు ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని బాండు రాసిచ్చి ఐదేండ్ల పాటు మోసం చేశారన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. ఇక జగిత్యాల జిల్లాకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి నిజామాబాద్ జిల్లా నాయకుల నుంచి పూర్తి స్థాయి సహకారం అందడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. అందుకే ప్రచారం ముమ్మరం చేయలేక పోతున్నారనే వాదన వినిపిస్తున్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. అయితే రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందని అన్నారు. ఇది గమనించి తమ పీఠాలకు ఎసరు వస్తుందనే కాంగ్రెస్, బిజెపిల నేతలు ఇష్టం వచ్చినట్లుగా హామీలు ఇచ్చి మాట్లాడుతున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వీరికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పూర్తి ఆధిపత్యంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో పదేళ్ల నాటికి, నేడు ఉన్న పరిస్థితులను ప్రజలు గమనించాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేసీఆర్ వెంట ప్రజలు నిలువాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అంధకారం అవుతుందని నాటి పాలకులు చెప్పారని గుర్తు చేశారు. వ్యవసాయానికి ఉచితంగా 24గంటలపాటు విద్యుత్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ కాళేశ్వరం నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తే ఇప్పుడు దానిని పడావు పెట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి ఇప్పుడు ఎట్ల చేస్తదో ప్రజలు ప్రశ్నించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న బీఆర్ఎస్ కు అండగా ఉండాలన్నారు.

# రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్రలు

హైదరాబాద్: అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. శనివారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగానో.. దౌర్జన్యంగానో.. 400 సీట్లు సాధించి రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణ బద్ధులై ఉన్నారు. ఇందులో భాగంగానే దేశం నలుమూలలా తిరుగుతూ అన్ని రకాల వ్యవస్థలు, సంస్థల్ని ఉపయోగించుకొని ముప్పేట దాడి చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత భాజపాపై .. కాంగ్రెస్ స్పష్టమైన ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రశ్నలకు ఇప్పటి వరకు నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా సమాధానం చెప్పలేదు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు విరుద్ధంగా వారు వ్యవహరిస్తున్నారుని రేవంత్ మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ మనువాద విధానాన్ని అమలు చేయాలని వారిద్దరూ ప్రయత్నిస్తున్నారు. వివిధ కులాలు, వర్గాలు ఉంటే హిందువులు ఏకతాటి మీదకురారు అనేది భాజపా కుట్ర. రిజర్వేషన్లు రద్దు చేస్తే.. వేర్వేరు కులాలు, వర్గాల ప్రస్తావన లేకుండా పోతుందనేది ఆ పార్టీ ఆలోచన. వచ్చే ఏడాదికి ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు అవుతుంది. 2025 నాటికి రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆర్ఎస్ఎస్ లక్ష్యం. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అందుకే 400 సీట్లలో గెలిపించాలని మోదీ పదే పదే కోరుతున్నారు. భారత్‌ను రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రిజర్వేషన్ల రద్దుపై భాజపా, భారాస ఒకే విధానంతో ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. మల్కాజిగిరిలో భాజపాను గెలిపిస్తామని నిన్న భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆయనపై కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈటలను కేటీఆర్ ఎందుకు విమర్శించడం లేదని ప్రశ్నించారు. ఐదు నియోజకవర్గాల్లో భాజపాకు భారాస మద్దతు ఇస్తోందని నేను చెబుతూనే ఉన్నా. అది నిజమని నిన్న మల్లారెడ్డి మాటలతో స్పష్టమైంది. పదేళ్లపాటు కేసీఆర్ భూములు అమ్ముతుంటే ఈటల రాజేందర్ ఎప్పుడైనా మాట్లాడారా? నేను రుణమాఫీ చేస్తాను అనగానే భూములు అమ్మవద్దని ఈటల కండీషన్లు పెడతున్నారని మండిపడ్డారు.
'మోదీ, అమిత్ షా అన్ని వ్యవస్థలను వాడుకుంటున్నారు. దేశ జనాభా ఆధారంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు నిర్ణయించింది. ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు రిజర్వేషన్లను వ్యతిరేకించాయి. రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర బీజేపీ చేస్తోందని, అయితే రాహుల్ గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌ను పూర్తి హిందూదేశంగా మార్చబోతున్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చబోతున్నారు.

## ఐదేళ్ల పాలన చరిత్రలో నిలుస్తుంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గత 58 నెలల కాలంలో హామీలు అమలు చేసిన తీరు చరిత్రలోనే నిలిచిపోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా చిరునవ్వుతో ప్రజలకు తోడుగా ఉన్నామని, ఆఖరికి కోవిడ్ లాంటి కష్టకాలంలోనూ సాకులు చెప్పకుండా సంక్షేమం అమలు చేశామని సీఎం జగన్ చెప్పారు. శనివారం ఉదయం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో 2024ను విడుదల చేశారు. మేనిఫెస్టో అంటే పవిత్రమైన గ్రంథం. గతంలో ఎన్నికలప్పుడు రంగు రంగుల హామీలతో ముందుకు వచ్చేవారు. కానీ, మేం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించాం. గత ఐదేళ్లలోనే మేనిఫెస్టోకు ప్రాధాన్యత వచ్చింది. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో, అధికారి దగ్గర మేనిఫెస్టో ఉంది. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి మేనిఫెస్టోను పంపించాం. ఓ ప్రోగ్రెస్ కార్డు మాదిరి ఏం ఏం చేశామన్నది ప్రజలకు ఎప్పటికప్పుడు వివరిస్తూ వచ్చాం. ఈ 58 నెలల్లో పథకాల్ని డోర్ డెలివరీ చేశాం. ఏ నెలలో ఏ పథకాల్ని ఇస్తామో చెప్పి మరీ అమలు చేశామని అన్నారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశాం. 2014లోనూ నాకు బాగా గుర్తుంది. ఆనాడు కూడా చేయగలిగిందే చెప్పాం. అమలు చేసినా, చేయకున్నా.. చంద్రబాబులా హామీలు ఇచ్చేదామని చాలామంది నా మంచి కోసమంటూ చెప్పారు. కానీ, నేను మాత్రం మోసపూరిత హామీల్లో చంద్రబాబుతో పోటీ పడలేకపోయా. చరిత్రలో చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండేందుకు.. చేయగలిగింది మాత్రమే చెప్పా. 2019లో చేయగలిగిందే చెప్పా. చెప్పిందంతా చేసి చూపించి ప్రజలకు దగ్గరకు ఒక హీరోగా వెళ్తున్నా. ఇదీ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా. ప్రజలు ఈ తేడా గమనించాలి. నాయకుడిని నమ్మి ప్రజలు ఓటేస్తారు. లీడర్‌షిప్ అంటే చెప్పిన ప్రతీ మాట అమలు చేస్తూ ముందుకు వెళ్లడమేనని అన్నారు. నా పాదయాత్రలో ఎన్నో కష్టాలు చూశాం. చదివించా లని ఉన్నా.. చదివించలేని తల్లుల పరిస్థితిని కళ్లారా చూశా. నేను చూసిన పరిస్థితులకు పరిష్కారం కోసం ఈ 58 నెలల పాలనతో పని చేశా. పేదలకు సంక్షేమం అందించాం. అర్హులను జల్లెడ పట్టి మరీ వెతికి సంక్షేమం అందించాం. ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్లడమూ ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజలు నమ్మి ఓటేస్తే కనీసం ఒక్క హామీ అయినా చంద్రబాబు నాయుడు అమలు చేశారా?. ముఖ్యమైన హామీలతో చంద్రబాబు సంతకం పెట్టి గతంలో ఇదే కూటమి ప్రజలను మోసం చేసింది. రుణమాఫీ, డ్వాక్రా రుణాల పేరుతోనూ చంద్రబాబు మోసం చేశారు. సున్నా వడ్డీని ఎగ్గొట్టారు.

# మోపూరిత కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరు

**నల్లగొండ:** బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజల గోసకు కారణమైన ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు పిల్ల మూకలు ఓ లెక్క కాదన్నారు. నల్లగొండలో పార్టీ నాయకులు కోటిరెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్‌తో కాలిసి బీఆర్‌పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆకలి
చావులు, ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ప్రజలు పాధి కోసం మళ్లీ విదేశాల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ సర్కార్‌లో పచ్చని పంటలతో కలకలలాడే భూములు బీడుగా మారాయని విమర్శించారు. పదేండ్లు అద్భుతంగా నిర్మించిన తెలంగాణను మూడు నెలల్లోనే కుప్పకూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తమ జీవితంలో నిజాలు మాట్లాడలేదని ఫైర్ అయ్యారు.

## కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

**సిద్దిపేట:** కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మాయమాటలు చెప్పి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేసిందని చెప్పారు. ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం ఉధృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి చేసి ప్రజలను కేసీఆర్ చైతన్యపరిచారని తెలిపారు. అంగబలం, అర్థబలం కలిగిన ఆంధ్ర నాయకత్వాలను ఎదిరించి నిలబడ్డారని చెప్పారు. తెలంగాణ వాదాన్ని అణిచవేయాలన్న ప్రతిసారి ఉద్యమం మరింత ఉధృతం చేశారన్నారు. తన పదవులను గడ్డిపోచలుగా వదిలేసి ప్రజల్లో చర్చపెట్టి తెలంగాణ వాదాన్ని గెలిపించారన్నారు. జలదృశ్యం నుంచి జన దృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు, అణచివేతలు, అనుమానాలు ఎదురయ్యాయని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. 23 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండా దించలేదని, పట్టిన పట్టును విడువలేదని చెప్పారు. గులాబీ జెండానే గులాంగిరీని అంతం చేసి తెలంగాణను తెచ్చిపెట్టిందని వెల్లడించారు. పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిందన్నారు. ఈ ఘనత ముమ్మాటికీ గులాబీ జెండాదేనని చెప్పారు. ఆత్మగౌరవంతో బతికే జాతి తెలంగాణ జాతి అని వెల్లడించారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడల్లా ధిక్కార స్వరమై నిలిచిందని పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలకోసం ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ సంసిద్ధమైందని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా సిద్దిపేటలో పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ లేకుంటే తెలంగాణ
వచ్చేది కాదని చెప్పారు. మన పథకాలను బీజేపీ కాపీ కొట్టిందని విమర్శించారు. అభివృద్ధిలో కేసీఆర్ ఆదర్శంగా ఉంటే.. తిట్లలో రేవంత్ రెడ్డి ఆదర్శంగా ఉన్నారని చెప్పారు.

# ఎన్నికల నిర్వహణకు

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్.

**నోడల్ అధికారులతో సమావేశమైన ఎలక్షన్ అబ్జర్వర్లు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 27**





నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీ.ఎం.నెమ్జి, పోలీస్ శాఖకు సంబంధించిన అబ్జర్వర్ రాజేష్ మీనాలు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లతో భేటీ అయ్యారు. రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, జగిత్యాల కలెక్టర్ డాక్టర్ యాస్మీన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తదితరులు పరిశీలకులతో భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో నిజామాబాద్ జిల్లాలోని బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. మొత్తం 1704867 మంది ఓటర్లు ఉండగా, 944 ప్రాంతాలలో 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. వాటిలో నిజామాబాద్ జిల్లాలో 1288 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాల జిల్లాలో 516 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు బాల్కొండ అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించిన నాలుగు పోలింగ్ పోలింగ్ కేంద్రాలు రాజన్నసిరిసిల్ల జిల్లాలోకి వస్తాయని తెలిపారు. ఎన్నికల నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధిత కమిటీలను నియమించి పకడ్బందీ పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అభ్యర్థులు, ఆయా పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుండి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఇప్పటివరకు జిల్లాలో రూ. 1.22 కోట్ల నగదు, రూ. 1.28 కోట్ల రూపాయల విలువ చేసే బంగారం, ఇతర విలువైన వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే, పోలీసులు, ఎక్సయిజ్ శాఖల ద్వారా 52 వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను గుర్తించి సీజ్ చేశారని వివరించారు. ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు నిరంతరం సోదాలు నిర్వహిస్తున్నాయని, పట్టుబడిన నగదుకు సంబంధించి ఆధారాలు కలిగి ఉన్న వారికి గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిశీలన జరిపించి నగదును తిరిగి అందజేస్తున్నామని తెలిపారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజెషన్ ప్రక్రియను పూర్తి చేసి ఓటింగ్ యంత్రాలను నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చామని, మొత్తం బ్యాలెట్ యూనిట్లు 2257, కంట్రోల్ యూనిట్లు 2257, వి.వి.ప్యాట్లు 2527 అందుబాటులో ఉన్నాయని అన్నారు. 15 మంది కన్నా ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన పక్షంలో అదనంగా బ్యాలెట్ యూనిట్లను కేటాయించేలా ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి సైతం మొదటి విడత శిక్షణ తరగతులు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మే 1 , 2 వ తేదీలలో రెండవ దఫా శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ ను 184 రూట్లుగా విభజిస్తూ 202 మంది సెక్టోరల్ అధికారులను నియమించామని అన్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలలో 509 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తిస్తూ, అదనపు బలగాలను మోహరిస్తున్నామని అన్నారు. కాగా, డిచ్పల్లిలోని సి.ఎం.సి కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మీన్ బాషా మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నిక సందర్భంగా కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఏర్పాట్ల గురించి పరిశీలకుల దృష్టికి తెచ్చారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పరిశీలకుల దృష్టికి తెచ్చారు. ఓటర్లను ప్రలోభపర్చే చర్యలను నిరోధించేందుకు వీలుగా జిల్లా సరిహద్దులలో నాలుగు అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, నెలకొల్పి నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని, ఇవే కాకుండా జిల్లా అంతటా డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వివరించారు. పొరుగున గల మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించి సరిహద్దు ప్రాంతం నుండి అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నియమిస్తున్నామని, సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటు మూడు కంపెనీల పారామిలిటరీ బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయని, సీ.ఆర్.పీ.ఎఫ్ బలగాలతో ఆయా ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహింపజేశామని సీ.పీ వివరించారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం అయితే తక్షణమే స్పందించేందుకు వీలుగా క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూ.ఆర్.టీ), స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలను నిశితంగా పరిశీలిస్తూ, సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని, నియమావళిని అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు పాత నేరస్థులు, రౌడీ షీట్ కలిగి ఉన్న 943 మందిని బైండోవర్ చేశామని, లైసెన్సులు కలిగి ఉన్న 76 ఆయుధాలను డిపాజిట్ చేయించామని వివరించారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్, కంట్రోల్ రూంలను పరిశీలకులు సందర్శించి పనితీరును పరిశీలించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.




# సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు "సత్యశోధక్ " విద్యార్థి.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 27:**

కర్ణాటక రాష్ట్రం తుంకూర్ లోఈ నెల 28 నుండి 30 వరకు జాతీయ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 3వ జూనియర్ సౌత్ జోన్ సాఫ్ట్ బాల్ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. పాఠశాలకు చెందిన ఎస్. సిద్ధార్థ ఈనెల 18న మెదక్ జిల్లా మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగింది. జాతీయ స్థాయికి ఎంపికైన ఎస్. సిద్ధార్థకు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగా మోహన్ లు అభినందించారు.పాఠశాల నుండి ఎంపికైన ఎస్. సిద్ధార్థకు ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికను అందించి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో క్రీడా నైపుణ్యం, స్ఫూర్తితో రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలవడానికి కృషిచేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ నర్సయ్య, గంగారెడ్డి మరియు వ్యాయమ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యంచ చెక్ పోస్టును పరిశీలించిన అబ్జర్వర్.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 27**

జిల్లా సరిహద్దు ప్రాంతమైన నవీపేట మండలంలోని యంచ వద్ద కొనసాగుతున్న చెక్ పోస్ట్ ను ఎన్నికల వ్యయ పరిశీలకులు డీ.ఎం. నెమ్జి శనివారం తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్ద చేపడుతున్న తనిఖీల తీరును పరిశీలించారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన నాటి నుండి ఇప్పటివరకు ఎంత మొత్తంలో అక్రమ నగదు, వస్తువులు, మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.
తనిఖీల వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. పోలింగ్ కు సమయం సమీపించిన దరిమిలా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు మద్యం పంపిణీ జరిగే అవకాశాలు ఉన్నందున గట్టి నిఘా కొనసాగించాలని అబ్జర్వర్ సూచించారు. ముఖ్యంగా సాధారణ సమయాలకంటే ప్రస్తుతం పెద్ద మొత్తంలో మద్యం రవాణా జరిగే అవకాశాలు ఉన్నందున ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని నిఘా బృందాలతో పాటు సంబంధిత అధికారులకు హితవు పలికారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.

# చూస్తూ ఊరుకోం.. యుద్ధం చేస్తాం



**మా పథకాలు అమలు చేయకుండా చతికిల**

**ఉద్యమం చేసి సాధించిన తెలంగాణను కాపాడాం**

**అభివృద్ధి పథకాలతో ముందుకు తీసుకున వెళ్లాం**

**నాగర్‌కర్నూలు ప్రచారంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్**

**నాగర్‌కర్నూల్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిలదీశారు. కొత్తగా గడ్డపార పట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? గత ప్రభుత్వంలో అమలైన పథకాలను అమలు చేయొచ్చు కదా..? అని అడిగారు.
నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.ఇవాళ గొప్పదినం. తెలంగాణ పార్టీ పుట్టిన దినం. 23 ఏండ్ల క్రితం తెలంగాణ సాధించాలని ఆనాడు పిడికెడు మందితో, గుండె ధైర్యం తెచ్చుకుని ఏపీ నుంచి బయటపడాలని ఉక్కు సంకల్పంతో యుద్ధం ప్రారంభించాం. పెరిగాం. మహాసముద్రం అయ్యాం. ఉప్పెనలా ఉద్యమం నడిపాం. ఆ క్రమంలో చాలా సార్లు నాగర్‌కర్నూల్ వచ్చాను. పార్టీకి 14 ఏండ్లు పూర్తయ్యే సమయంలో ఆమరణ దీక్షకు పూనుకుని
కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో తేలాలని ఆనాడు దీక్షకు పోతే ఖమ్మం జైల్లో వేశారు. మీరంతా ఉప్పెనలా ఉద్యమించారు. చివరకు కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం. తెచ్చుకున్న తెలంగాణలో పాలమూరు నా గుండెల్లో ఉంటది. ఈ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించుకున్నాం. ఆ గౌరవం చరిత్రలో మహబూబ్‌నగర్‌కు ఉంటది అని కేసీఆర్ తెలిపారు. కులం, జాతి, మతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను కోడి పిల్లలను సాదుకున్నట్టు పదేండ్లు గులాబీ జెండా కింద సాదుకుని, బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నాం. 50 ఏండ్లు కాంగ్రెస్, టీడీపీ పాలన ఉంటే పాత మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజైనా వచ్చిందా..? ఇవాళ ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి బీఆర్ఎస్ రాజ్యంలో. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి తండ్రి చనిపోయినప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు పిలిపించుకుని బస్సులో గద్వాలకు ప్రయాణించాను. వలసలు పోయినా పాలమూరు ఎట్లుందో చూడాలని 200 కి.మీ. బస్సులో వెళ్లాను. చాలా ఆనందం, సంతోష పడ్డాను. వరికోతలు, ధాన్యపు రాశులు చూస్తే ఆనందం కలిగింది. నా పాలమూరు ఇంత బాగైందని సంతోష పడ్డాను అని కేసీఆర్ పేర్కొన్నారు. మొన్న అడ్డగోలు హామీలిచ్చి దుష్ప్రచారాలు చేసి కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రైతుబంధు అందరికి వచ్చిందా..? ప్రతి ఆడబిడ్డకు రూ. 2500 వచ్చాయా.? రుణమాఫీ అయిందా..? తులం బంగారం వచ్చిందా..? అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా..? వరికి రూ. 500 బోనస్ వచ్చిందా..? చివరికి వస్తే ఎండింది ఎండంగ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పెడితే కొనే దిక్కు లేదు. వానలకు తడిసిపోతుంది తప్ప కొనే దిక్కు లేదు. ఈ ప్రభుత్వం పరిస్థితి ఇది. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఒక్క ఏడాదిలోనే కరెంట్ 24 గంటలు ఇచ్చాం. రెప్పపాటు కరెంట్ పోలేదు. కాంగ్రెస్ రాజ్యంలో కరెంట్ పోతుంది. బావుల కాడ తేళ్లు, పాములు కడుతున్నాయి. ఇప్పటి వరకు 225 మంది రైతులు చనిపోయారు. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు కరెంట్ షాకులతో, పాములు కరవడంతో చనిపోయారు. ఈ బాధ ఎందుకు వచ్చిందో ఆలోచన చేయండి. కేసీఆర్ పెట్టిన పథకాలు ఇవ్వాలి కదా.. కొత్తగా గడ్డపార పెట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? అని కేసీఆర్ ప్రశ్నించారు. సీఎం, మంత్రులు 24 గంటల కరెంట్ ఇస్తున్నాం అంటున్నారు. కానీ రోజుకు పది సార్లు పోతుంది. ఇవాళ శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో అన్నం తింటుంటే కరెంట్ పోయింది. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని తీసేశారా అని అడిగాను. ఒక్కసారి కాదు.. రోజుకు పదిసార్లు పోతుందని చెప్పారు. ఇది కాంగ్రెస్ పరిపాలన..

మీరంతా కళ్లారా చూస్తున్నారు. బ్రహ్మాండంగా మిషన్ భగరీథతో ఇంటింటికి నీళ్లు అందించాం. ఇప్పుడు బోర్లు ఎందుకు వేస్తున్నారు..? నీళ్ల ట్యాంకర్లు ఎందుకు వస్తున్నాయి.? బిందెలతో ఆడబిడ్డలు కనిపిస్తున్నారు అని కేసీఆర్ తెలిపారు. మళ్లీ మన ప్రభుత్వమే వస్తది.. ఇందులో ఏం అనుమానం లేదు.. రంది పడాల్సిన అసవరం లేదని కేసీఆర్ తేల్చిచెప్పారు.

# భాగ పంపిణీకి

## ఇక శ్మశానం తప్ప ఏమీలేదు

**73 ఏళ్లనాటి నవాబ్ ఫక్రుల్ ముల్క్ కేసును పరిష్కరిస్తూ హైకోర్టు సంచలన తీర్పు**

**కలకత్తా హైకోర్టు తరువాత తెలంగాణ హైకోర్టులో 73 ఏళ్ల కేసు పరిష్కారం**

హైదరాబాద్: అర్ధ శతాబ్దానికిపైగా నడిచిన నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసుల భాగ పంపిణీ వివాదానికి తెలంగాణ హైకోర్టు తెర దించింది. 73 ఏళ్లుగా కొనసాగుతున్న కేసును పరిష్కరిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. 72 ఏళ్లుగా దేశంలోనే అత్యంత పాత కేసుల్లో ఒకటైన బెర్హంపూర్ బ్యాంకు కేసును కలకత్తా హైకోర్టు గత ఏడాది పరిష్కరించగా, 73 ఏళ్ల పాత కేసును తెలంగాణ హైకోర్టు తాజాగా పరిష్కరించి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసుల మధ్య వివాదంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

### ఇదీ వివాదం

నవాబ్ ఫక్రుల్ ముల్క్‌కు చెందిన వారసత్వ భూమి పంపిణీ వివాదంలో 1951లో హైకోర్టులో మూడు రాజీ పిటిషన్‌ల ద్వారా ప్రాథమిక డిక్రీ జారీ అయింది. దాని ప్రకారం ఐదు భాగాలుగా ఐదుగురికి నగరంలో ఉన్న 9 ఆస్తుల పంపిణీ జరగాలి. అవి ఎర్రమంజిల్, ఎర్రగడ్డ, బొల్లారం, బల్దా, బెహ్లాల్‌ఖాన్‌గూడ, యూసఫ్‌గూడ, మూసాపేటలలో ఉన్నాయి. ఆ భూముల పరిరక్షణతోపాటు విక్రయించి వాటాలను పంచడానికిగాను ఇప్పటిదాకా 9 మంది రిసీవర్లు నియమితులయ్యారు. అప్పటి నుంచి ఒక్కో ఆస్తిని పంచే క్రమంలో తిరిగి వివాదాలు, కేసులు నడుస్తూ వస్తున్నాయి. కొంత ఆస్తిని వారసులకు భాగ పంపిణీ చేశారు కూడా. ప్రభుత్వం కూడా కొంత భూమిని సేకరించి పరిహారాన్ని ఇవ్వగా దానిని కూడా వారసులకు పంచారు. ఆ క్రమంలోనే ఎర్రగడ్డలోని ఎర్రం నూమా బంగళాకు సంబంధించిన 59 ఎకరాలను సేకరించి ప్రభుత్వ టీబీ ఆస్పత్రి నిర్మించింది. ఇంకా ఆస్తి పంపక వ్యవహారం ఎడతెగని వివాదంగా ఉండడంతో 2022 నవంబరు 29న విశ్రాంత జిల్లా జడ్జి మహమ్మద్ నిజాముద్దీన్‌ను చివరిగా రిసీవర్ కమ్ కమిషనరుగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గత ఏడాది మార్చి 16న తుది నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. నివేదికపై అభ్యంతరాలుంటే వ్యక్తం చేయవచ్చని హైకోర్టు బార్ అసోసియేషన్‌కు నోటీసు జారీచేసింది. కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

### శ్మశానం తప్ప ఏమీ మిగల్లేదు

రిసీవర్ సమర్పించిన నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆమోదించింది. వాస్తవానికి పంపిణీ చేయడానికి క్షేత్రస్థాయిలో అమీర్‌పేటలోని శ్మశానభూమి మినహా ఇంకేమీ లేదని రిసీవర్ నివేదికలో పేర్కొన్నప్పటికీ ఇంకా భూములున్నాయని వాటి భాగ పంపిణీ కాలేదంటూ కొందరు చేసిన అభ్యంతరాలను ధర్మాసనం తోసిపుచ్చింది. భూమి ఉందని పేర్కొంటున్నపుడు నిర్దిష్ట వివరాలు సమర్పించకుండా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేం. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు కొత్త కారణాలతో ఇంకా భాగ పంపిణీ జరగాల్సి ఉందని చెప్పజాలరు" అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### క్లెయిం తీసుకోనివారు సొమ్ము తీసుకోవచ్చు

భూముల విక్రయం ద్వారా వచ్చిన సొమ్ము 2023 మార్చి 10నాటికి రూ.1,18,81,249 హైకోర్టు వద్ద ఉందని, దాన్ని జాతీయ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశించింది. తమ వాటాను క్లెయిం చేసుకోని వారు చెక్ పిటిషన్ దాఖలు చేసి సొమ్మును వడ్డీ సహా తీసుకోవచ్చని తీర్పులో పేర్కొంది. అమీర్‌పేటలో ఉన్న శ్మశానవాటికను కేంద్రం చారిత్రక ప్రదేశంగా గుర్తించినందున, ముల్క్ వారసులు ఓ కమిటీ ఏర్పాటు చేసుకుని దాన్ని పరిరక్షించాలని, అంతేగానీ పంపకం జరగడానికి వీల్లేదని తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించిన 73 ఏళ్ల రికార్డులను భద్రపరచిన హైకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం అభినందించింది.

### పెండింగ్‌లో మరో మూడు పాత కేసులు

తెలంగాణ హైకోర్టులో నిజాం నవాబులు, పైగా భూములకు చెందిన మరో మూడు పాత కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

# పుష్పలో ముందు సుహాస్‌ను అనుకున్నా



మనసులో మాట చెప్పిన సుకుమార్ అల్లు అర్జున్ హీరోగా తాను తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ మూవీ 'పుష్ప' లోని ఫ్రెండ్ క్యారెక్టర్‌కు ముందుగా సుహాస్‌ని అనుకున్నామని దర్శకుడు సుకుమార్ తెలిపారు. 'ప్రసన్నవదనం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై, ఈ ఆసక్తికర విషయం పంచుకున్నారు. సుహాస్ హీరోగా అర్జున్ వై.కె. తెరకెక్కించిన చిత్రమిది. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ హీరోయిన్లు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో ఈవెంట్‌ను శుక్రవారం నిర్వహించింది. సతీసమేతంగా సుకుమార్, మరో దర్శకుడు బుచ్చిబాబు హాజరయ్యారు. 'సుహాస్.. నువ్వంటే నాకు, అల్లు అర్జున్‌కు ఇష్టం. నీ ఎదుగుదల చూస్తున్నాం. 'పుష్ప'లోని హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కేశవగా ముందు నిన్నే అనుకున్నాం. కానీ, అప్పటికే హీరోగా చేస్తున్న నిన్ను ఆ రోల్‌కి ఎంపిక చేయడం బాగోదనిపించింది. నాని నటన నాకు బాగా ఇష్టం. సుహాస్.. ఫ్యూచర్ నానిలా అనిపిస్తున్నాడు. సహజ నటుడు నాని కాబట్టి సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంతగా ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. ఈ సినిమాలో రాశీసింగ్, పాయల్ రాధాకృష్ణ చక్కగా నటించారు' అని ప్రశంసించారు. తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అర్జున్ గురించి మాట్లాడుతూ.. నేను 'జగడం' సినిమా రూపొందిస్తున్న సమయంలో అర్జున్ నన్ను కలిశాడు. 'మీ 'ఆర్య' చిత్రం నాకు బాగా నచ్చింది సర్. మీ వద్ద పని చేయాలనుకుంటున్నా' అని అన్నాడు. టీమ్‌లో జాయిన్ చేసుకున్నా. చాలా అమాయకుడు. కానీ, లాజిక్ ఉన్నవాడు. అర్జున్, మరో అసిస్టెంట్ తోట శ్రీనుతో కలిసి 23 రోజుల్లో '100శాతం లవ్' స్టోరీ రాశా. అప్పటి నుంచి నా ప్రతి సినిమాకి వీరిద్దరు పనిచేశారు. వీళ్లతోపాటు ఒక్కో చిత్రానికి ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఉండేవారు. అర్జున్ బిజీగా ఉండడంతో నేను లాజిక్ ఉన్న సినిమాలను మానేశా. అర్జున్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి.. నా అర్జున్‌ని సపోర్ట్ చేయండి' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.

# 3న వస్తున్న ..ఆ ఒక్కటీ అడక్కు

అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం మే 3న విడుదల కానుంది. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కింది. నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'హమ్మమ్మో'ను విడుదల చేశారు, ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. యశస్వి కొండేపూడి ఆలపించారు. వెన్నెల కిషోర్, జామీ లీవర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ తదితరులు ఈ చిత్రంలో కనిపించనున్నారు.




# ప్రేమ బంధానికి శృతి గుడ్‌బై



అగ్ర కథానాయిక శృతిహాసన్ తన ప్రేమబంధానికి గుడ్‌బై చెప్పిందా? అంటే ఔననే అంటున్నాయి ముంబయి సినీ వర్గాలు. డూడుల్ ఆర్టిస్టు శాంతను హజారికాతో ఈ భామ కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. తన లవ్‌ఫ్గ÷ర్‌పై శృతిహాసన్ బహిరంగంగా ఎప్పుడూ స్పందించనప్పటికీ.. ప్రియుడితో తీయించుకున్న ఫొటోలను తరచుగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేది. ఈ జంట ముంబయిలో సహజీవనం సాగిస్తున్నారనే వార్తలు కూడా వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ జంట విడిపోయినట్లు తెలిసింది. వ్యక్తిగత కారణాల వల్ల విడిపోయారని, పరస్పర అంగీకారంతోనే తమ బంధానికి గుడ్‌బై చెప్పుకున్నారని వార్తలొస్తున్నాయి. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తూ ఈ ప్రేమజంట సోషల్‌మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. 'ఈ ప్రయాణంలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా. ఇతరులనూ అర్థం చేసుకున్నా' అంటూ శృతిహాసన్ పెట్టిన పోస్ట్ కూడా వారి బ్రేకప్‌ను నిర్ధారిస్తున్నదని అమె అభిమానులు అంటున్నారు. అయితే ఈ వార్తల్లో నిజానిజాలేమిటో తెలియాలంటే ప్రేమికులిద్దరిలో ఎవరో ఒకరు స్పందించాల్సిందేనని అభిమానులు అనుకుంటున్నారు. ఇక కెరీర్‌పరంగా శృతిహాసన్ వరుస విజయాలతో దూసుకుపోతున్నది. ప్రస్తుతం డెకాయిట్, చెన్నై స్టోరీ చిత్రాల్లో శృతిహాసన్ నటిస్తున్నది.

# ఆరోగ్యానికే

## తొలి ప్రాధాన్యం అన్న సమంత




స్టార్ హీరోయిన్ సమంత తాజాగా తన అభిమానుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం చిన్న విషయం కాదని చెప్పుకొచ్చింది. తన మాటను గౌరవించే అభిమానులు ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపింది. ఇక తన అభిమానుల్లో చాలామందికి వినోదం, ఫ్యాషన్, మేకప్‌పై ఆసక్తి ఎక్కువ ఉంటుందని పేర్కొంది. వారిని చూసి ఎన్నో విషయాలపై తన అభిప్రాయాన్ని మార్చుకున్నానని, కొత్త అంశాలపై అవగాహన వచ్చినట్లు తెలిపింది. తన మాటలు కొద్దిమందిపై ప్రభావం చూపినా తనకు ఆనందమేనని పేర్కొంది. వీటి ద్వారా కొంతమంది లో అయినా మార్పు తీసుకురాగలిగితే అంతకు మించి తానేం కోరుకోను అంటూ చెప్పుకొచ్చింది. ఇక తన మనసుకు నచ్చిందే చేస్తానని సమంత ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఏ నిర్ణయం తీసుకున్నా అది సరైనదా.. కాదా, అని ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తానని తెలిపింది. మానసికంగా ప్రశాంతంగా లేకపోతే శారీరకంగా కూడా ఫిట్‌గా ఉండలేదని పేర్కొంది. అందుకే తానెప్పుడూ మెంటల్ హెల్త్‌కు ప్రాధాన్యత నిస్తానని వెల్లడించింది. అందుకోసం అవసరమైన వ్యాయామాలు కూడా చేస్తుంటానని వివరించింది.

# హాలీవుడ్‌లోనూ అవే కష్టాలు: ప్రియాంక

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే హాలీవుడ్‌లో స్థిరపడ్డారు ప్రియాంక చోప్రా. అక్కడకు వెళ్లిన తొలినాళ్లలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. అక్కడి వారెవరూ కనీస గౌరవం ఇవ్వలేదన్నారు. 'భారత్‌లో ఉన్నప్పుడు హాలీవుడ్ ప్రముఖ మ్యాగజైన్‌ల కవర్‌పై నా ఫొటో ఆరుసార్లు వచ్చింది. విదేశాలకు వచ్చాక ఎవ్వరూ కనీసం నాతో ఒక మీటింగ్ కూడా నిర్వహించలేదు. ఎన్నో ఎదురుదెబ్బలు, తిరస్కరణలు అనుభవించాను. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మౌనంగా నాపని నేను చేశాను. అదే ఈరోజు హాలీవుడ్‌లోనూ నాకు గుర్తింపు రావడానికి కారణమైంది. భారత్ నుంచి ఇక్కడకు రాగానే ఎంతో భయపడ్డాను. నాకు తెలియని పరిశ్రమ, పలకరించేవారు ఎవ్వరూ లేరు. ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న భావన మనసును కుంగదీసేది. అయినా ధైర్యంగా ముందుకు సాగాను' అని చెప్పారు. గతంలో ప్రియాంక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాలీవుడ్ లోని రాజకీయాలకు విసిగిపోవడం వల్లే హాలీవుడ్ లో స్థిరపడ్డాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'హిందీ చలన చిత్ర పరిశ్రమలో నన్ను ఓ మూలకు తోసేశారు. ఎవరూ నాకు అవకాశాలు ఇవ్వట్లేదు. పలువురితో విభేదాలు ఏర్పడ్డాయి. అక్కడ రాజకీయాలు ఉంటాయి. వాటితో నేను విసిగిపోయా. అందుకే బాలీవుడ్ నుంచి బ్రేక్ తీసుకోవాలనిపించింది. అలా అమెరికా వచ్చేశా' అని చెప్పారు. ఇటీవల తన భర్తతో కలిసి 'లవ్ అగైన్' తో అలరించిన ప్రియాంక.. 'హెడ్ ఆఫ్ స్టేట్' అనే యాక్షన్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే త్వరలో విడుదల కానున్న 'టైగర్' అనే డాక్యుమెంటరీలో అంబా అనే ఆడపులి పాత్రకు తన గొంతు అందిస్తున్నారు.

